

కథా కౌముది

# అనుకోనేలేదు...

శ్రావణి జన్నాభట్ల

పొద్దున్నే డ్యూటీకి టైం అయింది అన్నట్టు వచ్చి కూర్చున్నాడు సూర్యుడు. అందరి ఇళ్లల్లోంచి పిల్లలు స్కూల్ కి వెళ్ళే హడావిడి, అరుపులు వినపడుతూనే ఉన్నాయి. నిద్ర మెలుకువ వచ్చింది కానీ కళ్ళు అయితే తెరుపుడు పడట్లేదు. వంటింట్లోంచి ఏదో గిన్నె కిందపడిన పెద్ద శబ్దం, దాంతోటి పూర్తిగా మెలకువ వచ్చి నిద్ర లేచాడు సాగర్.

గడియారం వంక చూశాడు. ఆఫీస్ కి పరిగెత్తాల్సిన టైం అయిందని బాత్రూంలోకి వెళ్ళాడు. స్నానం చేసి బయటికి వచ్చేసరికి టిఫిన్ రెడీగా డైనింగ్ టేబుల్ మీద పెట్టి ఉంచింది భార్య లలిత.

పెళ్లయి ఆరు నెలలు అయింది. ఆమె కూడా ఉద్యోగం చేస్తూ ఉండడంతో సాగర్ కి అన్ని విధాలుగా సపోర్టివ్ గా ఉంది.

భార్యని ఆఫీసులో దించేసి బయలుదేరాడు. కారులో తన ప్లే లిస్ట్ లో ఉన్న మంచి మంచి పాటలు ప్లే అవుతున్నాయి. విపరీతమైన ట్రాఫిక్ లో ఇరుక్కుపోయాడు. లేట్ అయ్యేలా ఉంది అని వాచ్ చూసుకున్నాడు ఒకసారి.

"ఇవ్వాళ ఎలాగైనా సరే త్వరగా వెళ్లాలి కానీ కుదిరేట్టుగా కనిపించట్లేదు" అనుకున్నాడు మనసులో.

ఇరుక్కున్న ట్రాఫిక్ లో ఏం చేయాలో తెలియక కారులో వస్తున్న పాటతోటి తనూ గొంతు కలిపాడు సాగర్.

★★★

**కొంచెం సేపు అయ్యాక, పోలీస్ స్టేషన్ కి వెళ్ళాడు.**

**లోపలికి వెళ్దామా వద్దా? వెళ్దామా వద్దా ? అని చాలాసార్లు అనుకున్నాడు.**

**మొత్తానికి వెళ్లి పోలీస్ ఆఫీసర్ ని కలిశాడు.**

**"ఏం పని మీద ఇటు వచ్చారు?" అని అడిగాడు ఆ ఆఫీసర్.**

**"అది... అది... అది ఏంటంటే నాకు తెలిసిన ఒక అబ్బాయి చాలా రోజుల నుండి కనబడడం లేదు" అని చెప్పాడు.**

**"ఎవరో? ఏంటో? వివరాలన్నీఇవ్వగలరా?" అని అడిగాడు ఆఫీసర్.**

**"నాకన్నా ఒక పది ఏళ్ల చిన్నవాడు. ఇదిగోండి మిగిలిన వివరాలు, ఫోటో అన్నీ ఉన్నాయి. ఇవి తీసుకొని ఆ అబ్బాయి ఎక్కడ ఉన్నాడో కనిపెట్టాలి".**

**"సరే వివరాలు ఇచ్చారుగా ఎంక్వయిరీ చేసి త్వరలో ఏ విషయం చెప్తాము" అన్నాడు ఆఫీసర్ సీరియస్ గా.**

★★★

అలాంటి మరో రోజు..

పండగకి ఇద్దరినీ ఇంటికి రమ్మని పిలిచాడు లలిత తండ్రి. రోజు లాగే ఇద్దరూ హడావిడిగా ఆఫీస్ కి బయలుదేరారు.

కారులో వెళ్తున్నప్పుడు "ఇవాళ ఆఫీసులో నా పని అయిపోగానే నేను క్యాబ్లో అట్నుంచే మా ఇంటికి వెళ్లి పోతాను" అంది లలిత.

"సరే సరే నీ ఆఫీసు వచ్చింది చూడు. ఆ.. అన్నట్టు చెప్పడం మర్చిపోయా బిల్డర్ ఫోన్ చేశాడు. నెక్స్ట్ వీక్ ఒకసారి వచ్చి ఫ్లాట్ మొత్తం చూసుకో మన్నాడు. మనం ఒకే అంటే కీస్ హ్యాండ్ ఓవర్ చేస్తా అంటున్నాడు".

"వావ్! దట్స్ ఏ గ్రేట్ న్యూస్. ఈ విషయం అత్తయ్య గారికి చెప్పావా?" అంది ఎంతో ఎక్సైట్మెంట్ తో.

"లేదు. చెప్తాను"

"సరే నాకు టైం అవుతోంది" అంటూ హడావిడిగా కార్ దిగి వెళ్ళిపోయింది.

రోజు కన్నా ఆఫీస్ కి త్వరగానే చేరుకున్నాడు. ఆఫీస్ లో పెద్దగా పని ఏమీ లేకపోవడంతో ఒక చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకొని ఫోన్ లోంచి పాటలు వింటూ మానిటర్ వైపు చూస్తున్నాడు.

**వైబ్రేషన్ మోడ్ లో ఫోన్ మోగుతున్న సౌండ్. వెంటనే ఫోన్ లిఫ్ట్ చేశాడు.**

**"మీరు ఒక అబ్బాయి కనిపించట్లేదని కంప్లైంట్ ఇచ్చారు కదా! ఆ అబ్బాయి ఎక్కడున్నాడో తెలిసింది. మీకు ఆ విషయమే చెబుదామని ఫోన్ చేశాను" అన్నాడు ఆఫీసర్.**

"సాగర్...సాగర్..." అంటూ పిలుస్తున్నాడు కొలీగ్.

**"సరే సరే నేను మీతో ఈ విషయాలన్నీ తర్వాత మాట్లాడుతాను" అంటూ ఫోన్ పెట్టేసాడు హడావిడిగా.**

"క్లైంట్ నుంచి ఏదో ఇంపార్టెంట్ అప్డేట్ వచ్చింది అంట కదా! బాస్ నీతో మాట్లాడమన్నాడు" అన్నాడు కొలీగ్.

"యా యా ఇలా కూర్చో. ఐ విల్ షేర్ యు ద డీటెయిల్స్".

పొద్దున ఆఫీసులో పెద్దగా పని లేకపోయినా మధ్యాహ్నం నుండి ఉన్న మీటింగ్స్ తో అలసిపోయిన సాగర్ ఇంటికి వచ్చి సోఫాలో కూర్చున్నాడు.

"హా... ఇప్పుడు నేనే పెట్టుకొని తినాలి కదూ" అంటూ బద్ధకంగా వంటింటి వైపు చూసాడు.

ప్లేట్లో పుడ్డు పెట్టుకొని వచ్చి టీవీ చూస్తూ తిందామన్నట్టుగా సోఫాలో కూర్చున్నాడు. టీవీలో ఏదో చానల్లో పాటలు వస్తుంటే చూస్తూ తింటున్నాడు. ఇంతలో మళ్ళీ ఒక వైబ్రేషన్ సౌండ్. ఎవరా అని చెప్పి ఫోన్ లిఫ్ట్ చేసాడు.

"హలో నేను.."

"ఆ... హలో! చెప్పండి ఆఫీసర్ గారు మీ గొంతు గుర్తుపట్టాను" అన్నాడు సాగర్.

"అది మీరు ఒక అబ్బాయి గురించి ఎంక్వయిరీ చేయమన్నారు కదా ఆ అబ్బాయి ఇప్పుడు మా దగ్గరే ఉన్నాడు. మీరు ఒకసారి రాగలిగితే..."

"షూర్ షూర్ ఇప్పుడే వస్తాను" అంటూ ప్లేట్ ని ముందున్న టేబుల్ మీద పెట్టాడు.

వెంటనే ఆఫీసర్ దగ్గరికి వెళ్ళాడు.

వచ్చిన సాగర్ ని చూసిన ఆఫీసర్ "హలో! సాగర్ గారు రండి. ఆ అబ్బాయిని చూపిస్తా మీకు" అంటూ లోపలికి తీసుకెళ్లాడు.

ఆ అబ్బాయి కుర్చీలో కూర్చుని ఉన్నాడు.

అతన్ని చూడంగానే సాగర్ ఎంతో ఆవేశంతో "ఏమైపోయావ్ నువ్వు? ఇన్నాళ్ళ నుంచి ఎక్కడుంటున్నావ్? ఎన్ని రోజుల నుంచి నీ జాడ కోసం వెతుకుతున్నానో తెలుసా?".

ఆ అబ్బాయి నుంచి ఎటువంటి సమాధానం రాలేదు.

"మాట్లాడు. సమాధానం చెప్పు. ఏమైపోయావ్? ఏం చేస్తున్నావ్ ఇన్ని రోజులు?" అంటూ గట్టిగా నిలదీస్తున్నాడు.

ఆ అబ్బాయి నోరు విప్పలేదు. కానీ కళ్ళల్లో అయితే నీళ్ళు తిరుగుతున్నాయి.

"నువ్వు ఇంతగా బాధపడాల్సిన అవసరం ఏమి లేదు. ఇప్పటికైనా ఇప్పటికైనా నువ్వు అనుకుంటే..."

అతనితో మాట్లాడుతుండగానే సాగర్ ఫోన్ లో మెసేజ్ వచ్చిన సౌండ్. భార్య లలిత నుంచి. రేపొద్దునే త్వరగా వచ్చేయమన్నట్టుగా మెసేజ్. అక్కడ అంతకు మించిన ముఖ్యమైన విషయం జరుగుతుండేసరికి ఆ మెసేజ్ ని పెద్దగా పట్టించుకోలేదు సాగర్.

"నేను ఇతన్ని నా వెంట తీసుకెళ్తాను" సాగర్ అడిగాడు.

"మాకెందుకో అనుమానంగా ఉంది. మళ్ళీ కొన్ని రోజులయ్యాక అతను మీ దగ్గర క్షేమంగా ఉన్నాడా లేడా అని ఫోన్ చేసి కనుక్కుంటాం" అన్నాడు ఆఫీసర్.

"అలాగే" అంటూ అతన్ని తీసుకొని బయటికి వెళ్లిపోయాడు సాగర్

★★★

మర్నాడు పొద్దున్నే మామ గారి ఇంటికి బయలుదేరి వెళ్ళాడు సాగర్.

“రండి అల్లుడుగారు! రండి” అంటూ స్వాగతం పలికాడు.

“ఎలా ఉన్నారు మావయ్య గారు?” అంటూ ఆప్యాయంగా పలకరించాడు మామగారిని.

“ఆ ఆ అంత బానే ఉన్నాం అండి”, అంటూ సోఫాలో కూర్చోమన్నట్టుగా చేయి చూపించాడు మామగారు.

“బాగున్నావా బాబు! ఇదిగో మంచినీళ్లు తాగు. ఐదు నిమిషాల్లో వేడి వేడి భోజనం వడ్డించేస్తాను. కాళ్లు చేతులు కడుక్కోని ఉండు” అంటూ మళ్లీ వంటింట్లోకి వెళ్ళింది అత్తగారు.

భార్యాగారు ఎక్కడ ఊరేగుతుందా అన్నట్టు అతని కళ్ళు వెతికాయి.

ఆ విషయం అర్థం చేసుకున్న మామగారు “అమ్మాయి ఇక్కడే పక్కన ఉన్న కొట్టుకు వెళ్ళింది అల్లుడుగారు. ఇప్పుడే వచ్చేస్తుంది” అని సమాధానం ఇచ్చాడు.

అన్నంతలోనే లోపలికి వచ్చింది లలిత.

“వచ్చేశారా! పెందరాడే రమ్మన్నాను కదా. ఎందుకు ఇంత ఆలస్యం చేశారు?” అంటూ మొదలెట్టింది.

“అబ్బా! నువ్వు ఆగవే అల్లుడుగారు ని ఇబ్బంది పెట్టకూ. పదండి అల్లుడుగారు భోజనం చేద్దాం” అంటూ డైనింగ్ టేబుల్ దగ్గరికి తీసుకెళ్లాడు మామగారు.

భోజనాలయ్యాక భార్యాభర్తలు ఇద్దరూ అలా నడుచుకుంటూ బయటకి వెళ్లారు.

“ఇదిగో ఇదే నా స్కూలు. ఎల్కేజీ నుంచి టెన్త్ వరకు ఇక్కడే చదువుకున్నాను”.

“మ్.. చదువేనా ఆటలు, పాటలు ఏమన్నా ఉన్నాయా?” అన్నాడు సాగర్.

“ఓ! అన్నీ ఉన్నాయి కానీ వాటిలో నేనే ముందు లేను!” అంటూ పెద్దగా నవ్వింది.

ఆమె చెప్పిన సమాధానానికి సాగర్ కి కూడా కొంత నవ్వొచ్చినా ఏదో గుర్తుకు వచ్చింది.

“నీతో ఒక ముఖ్యమైన విషయం చెప్పాలి” అన్నాడు.

“ఏంటది?” అంటూ వేరే వైపుకు తిరిగి అటువైపు ఏదో చూస్తోంది లలిత.

“అది.. అది..” అని చెప్తుండగా___.

**మళ్లీ వైబ్రేషన్ సౌండ్. ఫోన్ లిఫ్ట్ చేసాడు సాగర్.**

**“ఆ రోజు మీరు పోలీస్ స్టేషన్ నుంచి తీసుకెళ్లిన అబ్బాయి మీ దగ్గర క్షేమంగానే ఉన్నాడా?” అంటూ ఆఫీసర్ ఫోన్ చేశాడు.**

**“అడిగేది మిమ్మల్నే సాగర్ గారు చెప్పండి?” అంటూ నిలదీస్తున్నాడు ఆ పోలీస్ ఆఫీసర్.**

**ఏమి సమాధానం చెప్పకుండా ఫోన్ కట్ చేసాడు సాగర్.**

“ఏంటి ఏదో చెప్తా అన్నావ్” అంటూ అతని వైపు తిరిగి భుజాన్ని గట్టిగా ఊపింది లలిత.

"ఏమీ లేదులే పాటలు, సంగీతం ఇట్లాంటి మంచి అలవాట్లు నీకేమన్నా ఉన్నాయేమో అని అడుగుదాం అనుకున్నా. నువ్వు చెప్పిన సమాధానం లోనే నీ టాలెంట్ ఏంటో అర్థం అయిపోయింది" అన్నాడు నవ్వుతూ సాగర్.

తిరిగి ఇంటికి వచ్చారు ఇద్దరు.

"కాసేపు నేను లోపల రెస్ట్ తీసుకుంటా" అంటూ బెడ్ రూమ్ లోకి వెళ్ళాడు సాగర్. పడుకుందామని గదిలోకి వెళ్లిన అతనికి ఎదురుకుండా ర్యాక్ లో పాత ఆడియో క్యాసెట్లు కనబడ్డాయి. వాటిని తీసి చూస్తుండగా వెనకాలే వచ్చాడు మామగారు.

"మా లలిత చిన్నప్పటివి అల్లుడుగారు.  ఏవో ఆ పాటలు ఈ పాటలు అంటూ వింటూ ఉండేది. దాని చిన్నప్పటి జ్ఞాపకాలుగా ఉంటాయి కదా అని అలాగే ఉంచాం. మీకేమైనా నచ్చితే పట్టుకెళ్ళండి.అన్నీ మంచి మంచి పాటలే ఉన్నాయి".

మామగారి మాటలకి పెదాలపై వచ్చిన చిన్న చిరునవ్వుతోటి క్యాసెట్లు వైపు తిరిగి చూశాడు సాగర్.

★★★

మర్నాడు పొద్దునే ఇంటికి తిరిగి వెళ్లడానికి సిద్ధమవుతున్నారు ఇద్దరూ.

"ఏమిటి అల్లుడు గారు బయలుదేరుతున్నారంటగా?" అంటూ గదిలోకి వచ్చారు మామగారు.

"అదే రేపొద్దునే ఆఫీసులో పని అది ఉంటుంది కదా..." అంటూ సగం చెప్పి ఆపేసాడు అల్లుడుగారు.

"అదే లేండి మీ పనులు మీకు ఉంటాయి కదా. అప్పుడప్పుడు వస్తూ ఉండండి.

"అలాగే తప్పకుండా. మీరు ఏమి అనుకోకపోతే ఆ క్యాసెట్లలో నాకు నచ్చినవి కొన్ని.." అంటూ అల్లుడు వాక్యం పూర్తి చేయకుండానే...

"భలేవారే! మీరు దాని గురించి అడగాల్సిన అవసరం లేదు. మీకు ఎన్ని కావాలంటే అన్ని తీసుకెళ్లండి" అన్నాడు మామగారు.

★★★

రోజూలాంటి మరో రోజు..

ఇద్దరూ వాళ్ళ వాళ్ళ ఆఫీసులకి వెళ్లడానికి రెడీ అవుతున్నారు.

"అన్నట్టు ఇవాళ్ళ మధ్యాహ్నం ఇద్దరం వెళ్లి ఫ్లాట్ చూసి ఫైనల్ చేసేద్దాం".

"గృహప్రవేశానికి వచ్చే నెలలో మంచి ముహూర్తాలు ఉన్నాయని అత్తయ్య గారు చెప్పారు. వచ్చేవారమే ఆవిడని ఇక్కడికి వచ్చేయమని చెప్పాను అన్ని ఏర్పాట్లు దగ్గరుండి చూసుకోవచ్చని" అంటూ ఎంతో ఆత్రుతగా మాట్లాడుతోంది లలిత.

"నాన్న కూడా ఉండుంటే ఎంతో బాగుండేది" అంటూ ఫోన్లో తండ్రి ఫోటో చూస్తూ ఉండిపోయాడు.

బాధపడుతున్నాడని తెలిసి ఓదార్పుగా పక్కనే వచ్చి కూర్చుని ఊరుకోమన్నట్టు అతని చేయి మీద చేయి వేసి ఓదారుస్తోంది.

“ఇదంతా జరిగి 10 ఏళ్ళు అయింది కానీ మొన్న మొన్ననే జరిగిందేమో అన్నట్టుగా ఉంది. ఒక వ్యక్తి మన మధ్య లేకపోవడం అనే లోటుని ఎవరూ తీర్చలేరు. పైగా హఠాత్తుగా జరిగే సంఘటనల వల్ల ఆ కుటుంబం ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుంది.” అంటూ బాధతో ఆపుకోలేని కన్నీళ్లను తుడుచుకున్నాడు.

“చూడు లైఫ్ లో కోల్పోయిన వాటి గురించి తలుచుకుంటూ ఉంటే ముందుకు ఎలా వెళ్ళగలము చెప్పు” అతన్ని ఉత్సాహపరచడానికి ఆమె నుంచి వచ్చిన మాటలు.

“18 ఏళ్లు, అప్పుడే ఇంజినీరింగ్ కాలేజీలో చేరిన రోజుల్లో అలాంటి వార్త వినాల్సి వస్తుందని ఎప్పుడూ ఊహించలేదు. ఏవేవో కలలు కన్నా కానీ ఒక్కసారిగా బాధ్యతలు అన్నీ మీద పడేసరికి కన్న కలలన్నీ ఒక్కసారిగా పేక మేడలు లాగా కూలిపోయాయి అనిపించింది”.

“అప్పటి నుండే బాధ్యతలను తెలుసుకోవడం వల్లే నువ్వు ఈరోజు లైఫ్ లో ఇంత మంచి పొజిషన్లో ఉన్నావ్. ఇంతకన్నా ఏం కావాలి చెప్పు. పద ఆఫీస్ కి వెళ్దాం టైం అవుతోంది” అంటూ ప్రేమగా అతని చేయి పట్టుకొని లాక్కొని తీసుకెళ్ళింది.

★★★

అనుకున్నట్టుగానే ఘనంగా కొత్త ఇంటి గృహప్రవేశం చేసుకున్నారు. లైఫ్ అంతా హ్యాపీ గా గడుస్తోంది.

★★★

అలా అలా ఇరవై సంవత్సరాలు గడిచాయి. వాళ్ళిద్దరూ నలుగురు అయ్యారు. 17 ఏళ్ల అబ్బాయి చరణ్, 14 ఏళ్ల అమ్మాయి స్వర. పిల్లలిద్దరూ చక్కటి సంగీతాన్ని నేర్చుకున్నారు. చరణ్ గిటార్ లో ఎక్స్పర్ట్ అయితే స్వర మంచి కీబోర్డ్ ప్లేయర్.

ఫోన్ లో పాటలు పెట్టుకొని పాడుతూ ఆనందిస్తున్నాడు సాగర్. ఇదంతా అక్కడే కూర్చుని హోంవర్క్ చేసుకుంటున్నా కొడుకు చరణ్ గమనిస్తూ ఉన్నాడు.

“నీ గొంతు చాలా బాగుంది నాన్న”.

వెంటనే ఒక చిన్న చిరునవ్వు వచ్చింది సాగర్ ముఖంలో.

“నీ మ్యూజిక్ కాన్సర్ట్ తాలూకు ప్రాక్టీస్ ఎలా జరుగుతోంది?” ఆసక్తిగా అడిగాడు సాగర్.

“చాలా బాగా జరుగుతోంది. కాకపోతే టైం దగ్గరకు వస్తోంది ఇంకా ఎక్కువ ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది” .

“అవకాశం వచ్చినప్పుడు వదులుకోకూడదు. వీలైనంత ప్రాక్టీస్ చేస్తూ ఉండు ప్రోగ్రామ్ అయ్యేంతవరకు”.

"సరే కానీ ఈసారి నీ 18వ పుట్టినరోజు ఎలా జరుపుకోవాలి అనుకుంటున్నావు?" అంటూ మనవడి పక్కన వచ్చి కూర్చుంది చరణ్ వాళ్ళ నాయనమ్మ సరోజిని.

"వీలైతే నా ఫ్రెండ్స్ ని తీసుకొని ఏదైనా రెస్టారెంట్ కి వెళ్దాం అనుకుంటున్నా నానమ్మ. ఇంతకీ మీరు నాన్న పుట్టినరోజుని చిన్నప్పుడు ఎలా సెలబ్రేట్ చేసేవాళ్లు?" అని ఆత్రుతగా అడిగాడు మనవడు.

"మీ తాత ఎప్పుడూ తన కొడుకుకి ఏ లోటు రానివ్వలేదు. అంతా వాడికి నచ్చినట్టే చేసేవాళ్లు. ప్రతి సంవత్సరం మీ నాన్న పుట్టినరోజుకి మీ తాత ఏదో ఒకటి సర్ప్రైజ్ ఇచ్చే వాళ్ళు".

"అవునా వావ్! తాత వస్ సో గ్రేట్" అంటూ తండ్రి వైపు తిరిగి చూసాడు చరణ్.

తండ్రి కళ్ళల్లో కన్నీళ్లు తిరగడం చూశాడు.

"ఏమైంది నాన్న?" అంటూ చనువుగా తండ్రి కాళ్ళ దగ్గరకు వచ్చి కూర్చున్నాడు.

"ఏం లేదులే నాన్న! నా 18వ బర్త్డే సర్ప్రైజ్ కోసం మా నాన్న ఏదో చేయాలనుకున్నది గుర్తొచ్చి..." చెప్పలేక ఆగిపోయాడు.

వెంటనే తల్లి సరోజినీ కళ్ళల్లో కూడా నీళ్లు తిరిగాయి.

★★★★

**ఆ పోలీస్ స్టేషన్ నుంచి సాగర్ కి మళ్ళీ ఫోన్ వచ్చింది.**

**"మీ దగ్గర ఉన్న ఆ అబ్బాయిని జాగ్రత్తగా చూసుకుంటున్నారా?" అడిగాడు ఆఫీసర్.**

**ఏమి సమాధానం చెప్పలేకపోయాడు సాగర్.**

**"చెప్పండి. ఎందుకు మౌనంగా ఉండి పోయారు? అంటే ఆ అబ్బాయి ఇప్పుడు మీ దగ్గర లేడా?" ఏమీ మాట్లాడట్లేదు సాగర్.**

**"ఎంత చెప్పాను మీకు? ఆ అబ్బాయిని జాగ్రత్తగా చూసుకోమని ఎంత చెప్పాను? ఏం చేశారు మీరు?" అంటూ ఆవేశంతో ఊగిపోతున్నాడు ఆఫీసర్.**

**ఏమి జవాబు చెప్పలేక ఫోన్ కట్ చేసేశాడు సాగర్.**

**"అవును నావల్ల కాలేదు. అతన్ని కాపాడుకోవడం బహుశా నాకు చేతకాదేమో" అంటూ బాధపడుతున్నాడు.**

**ఈ విషయాన్ని ఆ ఆఫీసర్ కి చెప్పాలనుకున్నాడు కానీ చెప్పలేకపోయాడు. అయితే ఇదే విషయాన్ని ఉత్తరం రూపంలో తెలియజేయడానికి పేపర్ మీద పెన్ పెట్టి రాస్తున్నాడు.**

★★★

పెన్ డ్రైవ్ అడగడం కోసం గది వరకు వచ్చిన చరణ్, తండ్రి ఎమోషనల్ గా ఏదో రాయడం తలుపు దగ్గర నుంచి చూసి ఏమీ మాట్లాడకుండా వెనక్కి తిరిగి వెళ్ళిపోయాడు.

తన కావాల్సిన పెన్ డ్రైవ్ కోసం వర్క్ రూమ్ లో వెతికాడు. దొరికింది. దాన్ని తీసుకొని తన గదిలోకి వెళ్లి లాప్టాప్ కి పెట్టి చూశాడు. తనకు కావాల్సిన పెన్ డ్రైవ్ అది కాదని అర్థమైంది. కానీ ఏవో పాత ఆడియో ఫైల్స్ ఉన్నాయి.

ఆ ఫోల్డర్స్ అన్ని ఓపెన్ చేసి చూశాడు. ఇన్నాళ్లుగా అతనికి తెలియని ఒక కొత్త విషయం తెలిసింది. దీని గురించి ఆలోచించి ఏదో ఒకటి చేయాలి అనుకున్నాడు మనసులో.

★★★★

చరణ్ ప్రోగ్రాం ఇచ్చే రోజు రానే వచ్చింది. ఎంతో ఉత్సాహంగా కుటుంబం మొత్తం వెళ్ళింది. ప్రోగ్రాం అంతా చాలా చక్కగా జరిగింది. అందులో చరణ్ గిటార్ వాయిస్తూ పాట పాడాడు. జనాలకి అతని టాలెంట్ బాగా నచ్చింది.

సోషల్ మీడియాలో అతని ప్రోగ్రాం పోస్ట్ కింద రకరకాల ప్రశంసలు. సాగర్ ఇదంతా చూసి ఎంతో సంతోషపడ్డాడు.

“నాన్న! నీతో మాట్లాడాలి” అంటూ తండ్రి దగ్గరకు వచ్చాడు చరణ్.

“చెప్పు చెర్రీ ఏంటి విషయం”

“నేను యూట్యూబ్ లో ఒక ఛానల్ ఓపెన్ చేద్దాం అనుకుంటున్నా. అందులో నా పెర్ఫార్మెన్స్ అన్ని ఎప్పటికప్పుడు అప్లోడ్ చేస్తూ, అలాగే సినిమా పాటలతో మెడ్లీ మిక్స్ చేయాలనుకుంటున్నా. ఐ మీన్ ఈ రోజుల్లో అందరూ చేస్తున్నదే. బట్ ఐ వాంట్ టు డు ఇట్ నాన్న”

“ఓకే గో ఎ హెడ్” అన్నాడు సాగర్ ఉత్సాహపరుస్తూ.

“దానికోసం నాకు మీ సహాయం కావాల్సి వస్తుంది” తండ్రి ఒప్పుకుంటాడో లేదో అన్న అనుమానంతో అడిగాడు చెర్రీ.

“ఏంటది చెప్పు?”

“అది మీరు ఆ ఛానల్ కోసం మీరు...” అంటూ సనిగాడు చరణ్.

“చెప్పు చరణ్ ఏం కావాలి నీకు?” అడిగాడుఎంతో ప్రేమగా సాగర్.

“అది మరేం లేదు మీరు నా ఛానల్ లో పాటలు పాడాలి”

“వాట్?”

“ఎస్ నాన్న! మీరు నా ఛానల్లో సాంగ్స్ పాడాలి. మీ వాయిస్ చాలా చాలా బాగుంటుంది. ప్లీజ్ నాన్న! కాదనకండి”

“చరణ్ నీ ఫ్రెండ్స్ ను ఎవరినైనా అడగొచ్చు కదా? నేనేంటి?”

"నాన్న! ప్లీజ్.. ప్లీజ్... దయచేసి ఫస్ట్ ఒక్క సాంగ్ పాడండి. ఆ తర్వాత వచ్చిన రెస్పాన్స్ బట్టి నెక్స్ట్ ఏం చేయాలో ఆలోచిద్దాం ప్లీజ్ నాన్న!" అంటూ తెగ బతిమిలాడాడు కొడుకు.

"వాడు అంతగా అడుగుతుంటే ఒప్పుకోవచ్చు కదా!" అంది భార్య.

"అవును రా ఒప్పుకో" అంటూ తల్లి కూడా వత్తాసు పలికింది.

తండ్రికి ఇంకో పక్కగా వచ్చి కూతురు కూడా అడిగింది " పాడొచ్చు కదా నాన్న!".

ఇంతమంది చెప్పేసరికి కాదనలేక ఒప్పుకున్నాడు సాగర్. చరణ్ అన్నట్టుగానే యూట్యూబ్ ఛానల్ ఓపెన్ చేశాడు. పాటల రికార్డింగ్ ను మొదలుపెట్టారు. చరణ్ గిటార్ వాయిస్తూ ఉంటే, కూతురు స్వర కీబోర్డ్ ప్లే చేస్తూ ఉంటే, సాగర్ పాట పాడాలి.

"ఆ ట్యూన్ అది..."

"ఆ.. ఆ... తెలుసు చెర్రీ. లెట్స్ స్టార్ట్" అంటూ గొంతు సవరించుకున్నాడు సాగర్.

ఫస్ట్ టైం రికార్డింగ్ అంతగా సరిగ్గా కుదరలేదు. మళ్లీ ట్రై చేద్దాం అన్నట్టుగా రెండోసారి మొదలుపెట్టారు. ఈసారి చాలా బాగా కుదిరింది. మెడ్లీ మిక్స్ అద్భుతంగా వచ్చింది

వెంటనే దాన్ని ఎడిట్ చేసి తన యూట్యూబ్ ఛానల్ లో అప్లోడ్ చేశాడు చరణ్. అప్లోడ్ చేసిన ఒక్క రోజులోనే బోలెడన్ని వ్యూస్ వచ్చాయి.

రెండు రోజుల్లో వైరల్ కూడా అయింది. కామెంట్ సెక్షన్ మొత్తం వాళ్ళ ముగ్గురు గురించి ప్రశంసలే.

"ఎంత ఎక్సలెంట్ గా ఉంది అతని వాయిస్"

"టాలెంటెడ్ ఫ్యామిలీ– ముగ్గురు కలిసి ఎంత బాగా పెర్ఫార్మ్ చేస్తున్నారు"

"తన పిల్లలతో పాటు ఈ ఏజ్ లో ఎంత ఎనర్జిటిక్ గా పెర్ఫార్మ్ చేస్తున్నాడు. సచ్ ఏ ప్రొఫెషనల్ వాయిస్ హి హాస్"

కాంప్లిమెంట్స్ వర్షం. ఇదంతా నిజమేనా అంటూ ఆశ్చర్యపోయాడు సాగర్. తన తండ్రి వాయిస్ వైరల్ అవ్వడం తోటి పెన్ డ్రైవ్ లో ఉన్న తన తండ్రి పాత పాటలు కూడా సోషల్ మీడియా లో రిలీస్ చేశాడు చరణ్. సాగర్ కి మంచి ఫాలోయింగ్ పెరిగింది.

★★★

ఒకరోజు సాగర్ ఆఫీస్ లో పని చేసుకుంటూ ఉండగా ఒక కొత్త నెంబర్ నుండి కాల్ వచ్చింది.

"హలో సాగర్ గారు, నా పేరు శరత్ అండి. అది ఈ మధ్యన యూట్యూబ్ లో వచ్చిన మీ మిడ్లీ మిక్స్ పర్ఫామెన్స్ చూసాం. దట్ ఇస్ రియల్లి ఆసం. మేము, మా గ్రూప్ కలిసి ఒక ప్రైవేట్ సాంగ్ చేయాలనుకుంటున్నాం. ఆ సాంగ్ కి మీ

వాయిస్ యాడ్ అయితే చాలా బాగుంటుంది అనిపిస్తుంది. మీరు మా ఆఫీస్ కి ఒకసారి వస్తే, ఆడిషన్స్ చేద్దామనుకుంటున్నాము?"

"ఆ.. అది.. నేను.." అంటూ సనిగాడు సాగర్.

"సర్ ప్లీజ్ దయచేసి నో చెప్పకండి".

"ఓకే. మీ ఆఫీస్ అడ్రస్ డీటెయిల్స్ మెసేజ్ చేయండి. ఐ విల్ కం" అంటూ ఫోన్ పెట్టేసి ఎంతో ఉబ్బితబ్బిబ్బైయ్యాడు సాగర్.

చెప్పినట్టుగానే శరత్ వాళ్ళ టీం దగ్గరికి ఆడిషన్స్ కి వెళ్ళాడు. ఆ ఆడిషన్స్ అవ్వగానే వాళ్ళు ఏదో చెప్పారు కూడా.

★★★

ఇంటికి తిరిగి వచ్చాడు సాగర్. వస్తూనే సోఫాలో కూర్చున్నాడు. లలిత తనకన్నా ముందే ఆఫీస్ నుండి వచ్చేసింది..

సోఫాలో కూర్చున్న సాగర్ ని చూసి "ఈరోజు ఇంత ఆలస్యం అయింది ఏంటి?" అంటూ అడిగింది.

సమాధానం చెప్పకపోవడంతో ముందుకొచ్చి చూసింది. కళ్ళనుండి కన్నీళ్లు కారుతూ ముఖమంత ఎర్రగా అయిపోయి చాలా ఎమోషనల్ గా ఉన్నాడు సాగర్.

"ఏమైంది? ఎందుకు ఇంత బాధపడుతున్నావ్? అంటూ దగ్గర కూర్చుంది భార్య.

★★★

**ఇంతలో వైబ్రేషన్ సౌండ్. ఆ పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్.**

**"ఆ అబ్బాయిని మీరు కాపాడుకోలేకపోయారని ఉత్తరం రాశారు. కానీ ఆ అబ్బాయి మీ దగ్గరే ఉన్నాడు కదూ?" అంటూ ఆఫీసర్ అడగగా...**

**సాగర్ "అవును! అవును! ఆ అబ్బాయి నా దగ్గరే ఉన్నాడు. నేను వాడిని ఎక్కడ కోల్పోలేదు" అంటూ ఇంకా ఎమోషనల్ అయ్యాడు.**

అతని చుట్టూరా ఉన్న భార్య, కూతురు, తల్లి అందరూ ఏదో అడుగుతూనే ఉన్నారు. కానీ అతనికి ఏమి వినిపించలేదు.

చరణ్ "నాన్న! నిన్నే" అన్నట్టుగా గట్టిగా భుజం ఊపి " ఏం జరిగింది?" అని అడిగాడు.

"శరత్ అండ్ టీం వాళ్లు యూట్యూబ్ ఛానల్ లో మా పర్ఫామెన్స్ చూసి నాకు కాల్ చేశారు.వాళ్ళు ఒక చిన్న ప్రైవేట్ సాంగ్ తీయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఆ సాంగ్ పాడటానికి నన్ను ఆడిషన్స్ కి రమ్మంటే వెళ్లాను. వాళ్లు.. నన్ను... వాళ్లు... నన్ను.. సెలెక్ట్ చేసుకున్నారు. టు వీక్స్ తర్వాత రికార్డింగ్ స్టార్ట్ చేస్తారంట".

అందరూ మౌనంగా ఉన్నారు. విన్నది నిజమేనా కాదా అన్నట్టు చూస్తున్నారు.

"అంటే సెలెక్ట్ అయితే చెప్పచ్చు లే అన్నట్టుగా మీ ఎవ్వరికి ఈ విషయం గురించి నేనే చెప్పలేదు" అన్నాడు సాగర్.

పక్కనే ఉన్న కూతురు తండ్రి చుట్టూరా రెండు చేతులు వేసి..

"కంగ్రాట్యులేషన్స్ నాన్న!" అంటూ పెద్దగా అరిచింది.

వావ్! దట్స్ ఏ గ్రేట్ న్యూస్ నాన్న. మీరు నా 18 బర్త్డే కి ఇచ్చిన గ్రేట్ సర్ప్రైజ్ ఇది!" అంటూ తండ్రి చేయి పట్టుకొని షేక్ హ్యాండ్ ఇచ్చాడు కొడుకు.

భార్య, తల్లి కళ్ళల్లో చెప్పలేనంత ఆనందం.

★★★★

అనుకున్నట్టుగానే చరణ్ తన 18 వ బర్త్డే ని ఫ్రెండ్స్ తో కలిసి బయట రెస్టారెంట్లో జరుపుకున్నాడు.ఎంతో ఆనందంగా ముగిసింది ఆ రోజు.

డిన్నర్ అయిపోయి తన బెడ్ రూమ్ లో తన పాత జ్ఞాపకాల తాలూకు ఫోటోలను తీసి చూస్తూ ఆనంద పడుతున్నాడు సాగర్. అలా ఆనందపడుతున్న అతనిని చూసింది లలిత.

"నా 17వ ఏట ఫోటో ఇది. నా ఫ్రెండ్స్ తో కలిసి దిగిన ఫోటో. ఆ తర్వాత కొన్ని రోజులలో నా పుట్టినరోజు ఉందని మా నాన్న నాకోసం ఒక సర్ప్రైజ్ ప్లాన్ చేయడానికి ఒక పాటల పోటీదారులను కలిసి వస్తుండగానే ఆ ఆక్సిడెంట్ లో అలా.." అతని మాట అక్కడే ఆగిపోయింది.

ఇంతలో కొడుకు చరణ్ గదిలోకి వచ్చాడు. తల్లిదండ్రుల దగ్గరగా కూర్చున్నాడు.

"మీకు పాటలు అంటే ఎంతో ఇష్టం. ఎలాగైనా సరే మంచి సింగర్ అవ్వాలన్న ది మీ డ్రీమ్. ఈ విషయాన్ని మీరు చెప్పకుండానే అర్థం చేసుకున్న తాత, మీ 18 బర్త్డే కి మీకు తెలియకుండానే ఒక పాటల పోటీలో మీ పేరుని నమోదు చేసి మిమ్మల్ని సర్ప్రైజ్ చేయాలనుకున్నారు కదా!".

కొడుకుకి ఈ విషయం ఎట్లా తెలుసా అన్నట్టు ఆశ్చర్యంగా చూస్తున్నాడు సాగర్.

"కానీ దురదృష్టవశాత్తు, ఆ రోజు ఆ అప్లికేషన్ తీసుకొని స్కూటర్ మీద మీ కాలేజీ దగ్గరకి వస్తుంటేనే తాతకి యాక్సిడెంట్ అయ్యి..." అంటూ అక్కడే ఆపేసాడు ఆ మాటని చరణ్.

"నీకు ఈ విషయాలన్నీ ఎలా తెలుసు?" అంటూ కొడుకును ప్రశ్నించాడు సాగర్.

"మీరు ఒకరోజు డైరీలో ఏదో రాయడం చూశాను. ఆ మర్నాడు డైరీ కింద పడిపోయి అది ఓపెన్ అయి ఉండేసరికి... నాకు తెలుసు పర్సనల్ డైరీ చదవకూడదని. అందుకే ఆ ఓపెన్ అయి ఉన్న పేజీ చదివాను. మీరు మాతో చెప్పుకోలేక మీలో మీరు దేనికో స్ట్రగుల్ అవుతున్నారని అర్థమైంది. ఆ డైరీకి మీరు పెట్టుకున్న పేరు 'నెరవేరని కల' అని ఉంది. సో, చదవచ్చు అనిపించి మొత్తం చదివి చూస్తే... తాత మీ 18 ఏళ్లప్పుడు చనిపోయేసరికి బాధ్యతలన్నీ మీ మీద

పడటం వల్ల మీరు మీ డ్రీమ్ ని పక్కన పెట్టాల్సి వచ్చిందని అర్థం అయింది. అండ్ అలాగే మన ఇంట్లో ఒక పెన్ డ్రైవ్ లో మీరు పాడిన పాటలు రికార్డు చేసుకున్నవి విన్నాను. సో మీలో ఆ కోరిక అలాగే ఉండిపోయింది అనిపించింది”.

“చూస్తూ ఉండండి నాన్న! అతి త్వరలోనే మీరు పెద్ద సింగర్ అయిపోతారు” అంటూ సాగర్ కన్నీళ్లను తుడిచిన కొడుకుని దగ్గరకు తీసుకున్నాడు.

ఆ తర్వాత చరణ్ తన గదిలోకి వెళ్లిపోయాడు.

★★★

“ఏంటిది సాగర్ కనీసం నాతో కూడా ఎప్పుడు అనలేదు నీ డ్రీమ్ గురించి” అంటూ లలిత ఎంతో ఆవేదనగా అడిగింది.

“నాన్నకి అలా జరగడం. అదీ ఆయన నాకోసం ఏదో సర్ప్రైజ్ ప్లాన్ చేస్తుండగా అట్లా అవ్వడం నన్ను బాగా డిస్టర్బ్ చేసింది. ఆ తర్వాత నా చదువు కంప్లీట్ చేసుకోవడానికి నేను పడ్డ కష్టాలు, ఆపై ఇంటి బాధ్యత. ఇవన్నీ నన్ను ఉక్కిరి బిక్కిరి చేశాయి. అలాంటి సమయంలో నేను నా కలలు అంటూ ఆలోచించడం తప్పనిపించి దాన్ని పక్కన పెట్టేసాను.

**కానీ ఆ థాట్స్ నన్ను ఏదో ఒక రూపంలో వెంటాడుతూనే ఉండేవి. ఇన్ఫాక్ట్ నా మైండ్ ఒక పోలీస్ స్టేషన్ లాగా అనిపించేది. నేను ఒకప్పుడు కోల్పోయిన నా కల గురించి నాకు నేనే కంప్లైంట్ చేసుకున్నట్టు. ఆ కంప్లైంట్ గురించి ఒక ఆఫీసర్ నాకు పదేపదే ఫోన్ చేసి గుర్తు చేస్తున్నట్లు అనిపిస్తూ ఉండేది. ఒక్కోసారి ఈ థాట్ ప్రాసెస్ ని తట్టుకోలేకపోయేవాడిని.**

చాలాసార్లు నీకు చెప్పాలనే అనుకున్నాను. కానీ నా బాధ్యతలన్నింటిని సగం పంచుకుంటున్న నీకు ఇవన్నీ చెప్పి నీ మైండ్ ని పాడు చేయకూడదని...” మాట్లాడుతూ మాట్లాడుతూ మళ్ళీ అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

“చిన్నప్పటినుంచి పాటలు అంటే చాలా చాలా ఇష్టం లలిత. అది ఇష్టం కూడా కాదు అంతకు మించినది. 15 ఏళ్లు వచ్చేసరికి ఫ్యూచర్లో సింగర్ అవ్వాలి అని ఫిక్స్ అయ్యాను కూడా. సంగీతం నేర్చుకోకపోయినా, సాధన చేస్తే ఏదైనా సాధ్యం అవుతుందన్న నమ్మకంతో అమ్మానాన్నలకి కూడా తెలియకుండా నా గదిలో కూర్చొని అన్ని రకాల పాటలు ప్రాక్టీస్ చేస్తూ ఉండేవాడిని. మే బి ఈరోజు నా కొడుకు చరణ్ పసిగట్టినట్టే ఆ రోజుల్లో మా నాన్న కూడా తలుపు దగ్గర నుండి అలా నా పాటలు విని వీడికి సింగర్ అయ్యే మంచి లక్షణాలు ఉన్నాయి అనుకుని ఆ పోటీ నిర్వాహకులని కలిసి ఉంటారు”.

“కానీ ఆయన పోటీ నిర్వాహకులని కలిసారని విషయం నీకు ఎలా తెలుసు?” అని అడిగింది లలిత.

“ఆయన చనిపోయినప్పుడు ఇచ్చిన బిలాంగింగ్స్ లో ఫిల్ చేయబడ్డ పాటల పోటీల అప్లికేషన్ కూడా ఉంది. అది చూడంగానే నా గుండె మరింత తరుక్కుపోయింది. నాలుగు రోజులు తర్వాత ఆ నిర్వాహకుల నుంచి ఫోన్ కూడా వచ్చింది, ఆడిషన్స్ కి రమ్మని. నేను కన్న కల ఆయన ఊపిరినే ఆపేసిందా అనిపించింది. అందుకే...అందుకే ఆ

విషయాన్ని వదిలేశాను. అప్పటినుండి కేవలం నా లక్ష్యం ఒకటే అనుకున్నాను. అమ్మని జాగ్రత్తగా చూసుకుంటూ ఇంటి బాధ్యతను తీసుకోవాలంటే ఎలాగోలాగ చదువుకొని లైఫ్ లో మంచిగా సెటిల్ అవ్వాలి అంతే" అంటూ ఎన్నో ఏళ్లుగా గుండెల్లో దాగి ఉన్న బాధనంతా భార్యకు చెప్పుకున్నాడు సాగర్.

"ఆ తరువాత ఉద్యోగం,ఇంటి లోన్, పిల్లల చదువులు అంటూ ఉరుకుల పరుగుల మీద జీవితం గడుస్తుండే సరికి నీకంటూ ఉన్న ఒక ప్రత్యేకమైన ఇష్టాన్ని పూర్తిగా వదిలేయాల్సి వచ్చింది. అంతేనా?" అంటూ బరువెక్కిన గుండెతో భారంగా మాట్లాడుతోంది భార్య కూడా.

ఎంతో బాధతో కూడిన సంభాషణ జరిగేసరికి, అతని మనసును తేలిక పరచడానికి...

"ఏనీవే లేటు వయస్సులో వచ్చిన లేటెస్ట్ సెన్సేషన్ మా ఆయన" అంటూ అతన్ని నవ్వించే చిన్న ప్రయత్నం చేసింది లలిత.

★★★

మర్నాడు సాగర్ ఆఫీసులో పని చేసుకుంటూ ఉండగా మామగారి నుంచి ఫోన్ వచ్చింది.

"నేను విన్నదంతా నిజమేనా అల్లుడుగారు? అమ్మాయి చెప్పింది మీరు ఏదో పాట పాడబోతున్నారని".

"ఆ అది ఒక ప్రైవేట్ పాట ఏదో పాడమని అడిగారు.."

"మీరు మా ఇంటికి వచ్చినప్పుడల్లా క్యాసెట్లు గురించి అడిగుతుంటే ఏదో పాటలంటే మామూలుగా ఇష్టం అనుకున్నాను కానీ దాని వెనకాల ఇంత ఆశ ఉందని ఊహించనేలేదు. ఏదైతేనే చాలా సంతోషం. ఇప్పటికైనా మీ కలను నెరవేర్చుకుంటున్నారు. నా స్నేహితుడు ఒకడికి మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీ ప్రసాద్ తో పరిచయం ఉందని విన్నాను. మీ గురించి ఒక మాట చెవిలో ఏమన్నా వేయమంటారా..?" అంటూ చనువుగా మామగారు వేసిన చిన్న జోక్ కి పెద్దగా నవ్వాడు సాగర్.

సాగర్ చెప్పినట్టే రెండు వారాల్లో పాటల రికార్డింగ్ మొదలైయ్యింది. రికార్డింగ్, మిక్సింగ్లు, ఎడిటింగ్ అంతా పూర్తయి పాట బయటికి రిలీజ్ అవ్వడానికి మూడు నెలలు పట్టింది. రిలీజ్ అయిన వెంటనే పాట బాగా వైరల్ అయింది.

ఆ తర్వాత మళ్లీ అవకాశాలు అయితే సాగర్ కి రాలేదు కానీ కొడుకు యూట్యూబ్ ఛానల్ లో పిల్లలతో కలిసి మెడ్లి మిక్స్లు తే చేస్తూనే ఉన్నాడు. ఆ కొడుకు దృష్టిలో ఈ తండ్రి ఒక పెద్ద సింగర్.

వాళ్ళ అమ్మ దగ్గర కూర్చొని "నా 18 ఏళ్ల వయసులో నాన్న నాకు ఇష్టమైన బహుమానం ఇచ్చి నన్ను సర్ప్రైజ్ చేద్దామనుకున్నారు. కానీ 18 ఏళ్ల నా కొడుకు ఇప్పుడు నా కలని నెరవేర్చి నాకే సర్ప్రైజ్ ఇస్తాడని అనుకోనేలేదు. బహుశా నాన్నే నా కొడుకు రూపంలో పుట్టి నా కల నెరవేరే లాగా చేశారేమో అనిపిస్తోంది అమ్మ" అన్నాడు ఫోన్ లో వాళ్ళ నాన్న ఫోటోని చూస్తూ. @@@###@@@

COMMENTS